ఆందోళన వద్దు.. కోవిడ్ నిబంధనలు పాటించండి



మౌలానా ఆజాద్ నగర్ బస్తీ దవాఖానాను సందర్శించిన కార్పొరేటర్

కాచిగూడ: కరోనా మహమ్మారి విజృంభిస్తుండటంతో ప్రజలు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ సూచించారు. శుక్రవారం కాచిగూడ డివిజన్, మౌలానా ఆజాద్‌నగర్ బస్తీ దవాఖానాను ఆమె సందర్శించి అక్కడ ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. కోవిడ్ విషయంలో ఎలాంటి ఆందోళనలు అవసరం లేదని.. జాగ్రత్తలు పాటించాలన్నారు. బహిరంగ ప్రదేశాలకు వెళ్లినప్పుడు మాస్కులు ధరించాలని ఆమె సూచించారు. రోజురోజుకూ చలితీవ్రత పెరిగిపోతుండటంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చేందుతున్నాయని, అందుకు అవరమైన మందులు, వైద్య సేవలను బస్తీ దవాఖానాలో అందుబాటులో ఉండేలా చూడాలని అక్కడి వైద్యులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కౌశిక్ రెడ్డి, బీజేపీ నేతలు బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, ఓం ప్రకాష్, ఆర్.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధ విద్యతోనే ఉన్నత శిఖరాలు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ శ్రీరాములు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రణాళికాబద్ధమైన విద్యతోనే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని ప్రొఫెసర్ డి.శ్రీరాములు అన్నారు. శుక్రవారం ఆర్టీసీ కళాభవన్‌లో అరోరా కాలేజ్ (అటానమస్) ఆధ్వర్యంలో ఆలాప్–2023 పేరిట విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ శ్రీరాములు మాట్లాడుతూ... క్రమశిక్షణ, పట్టుదల ఉంటే అసాధ్యమంటూ ఏదీ లేదన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో తట్టుకోవాలంటే కేవలం అకడమిక్ విద్యపైనే ఆధారపడకుండా సమాజంపై అవగాహన పెంచుకునేలా విద్యార్థులు కృషి చేయాలని తెలిపారు. ప్రముఖ వ్యాపారవేత్త సతీష్‌కుమార్ నాగమళ్ల మాట్లాడుతూ... విద్యార్థులు తమ లక్ష్యసాధన కోసం అహర్నిశలు కృషి చేయాలన్నారు. విద్యార్థులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ బి.అరుణ్‌కుమార్, భానుప్రకాష్ ఉమాపతి, అరోరా విద్యా సంస్థల కార్యదర్శి డాక్టర్ నిమ్మటూరి రమేష్‌బాబు, వైస్ చైర్మన్ అనుదీప్, డైరెక్టర్ డాక్టర్ ఎం.మాధవి, డాక్టర్ రఘునాగప్రభాకర్, ఎంబీఏ, ఎంసీఏ విభాగాల అధిపతులు సి.హెచ్.సతీష్‌కుమార్, దేవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి చిక్కడపల్లి శ్రీవారి ఆలయం ముస్తాబు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రతిష్టాత్మకమైన చిక్కడపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి (వైకుంఠ) ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక వంశీయుడు కుమారుడు జి.శ్రీనాథ్‌గౌడ్, ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.రామాంజనేయులు తెలిపారు. ముక్కోటి ఏకాదశికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం మూడు క్యూ లైన్‌లు, మెటల్ డిటెక్టర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా పోలీసుల సహకారంతో అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు ఆలయ సమీపంలోనే అందుబాటులో ఉంటాయన్నారు. ఉదయం 5 గంటల నుంచే భక్తులకు స్వామి వారి దర్శనం ఉంటుందని తెలిపారు.

‘వర్గీకరణకు మద్దతిస్తే బీజేపీకి రాజకీయ సమాధి తథ్యం’



నివాళులర్పిస్తున్న మాల సంఘాల జేఏసీ నేతలు

కవాడిగూడ: ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇస్తే బీజేపీని రాజకీయంగా సమాధి చేస్తామని తెలంగాణ రాష్ట్ర మాలసంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రామచందర్ హెచ్చరించారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర మాలసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో మాల మహానాడు వ్యవస్థాపకులు పోతుల విగ్నేశ్వరరావు (పి.వి.రావు), కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతుల సందర్భంగా వారికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా చెరుకు రాంచందర్ మాట్లాడుతూ... పీవీ రావు మాలల హక్కుల సాధనకై దళితుల ఐక్యత కోసం, రాజ్యాంగ పరిరక్షణకోసం అహర్నిశలు కృషిచేసినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల పేదలకు ఇళ్లు ఇప్పించిన ఘనత వెంటస్వామిదని కొనియాడారు. అంబేడ్కర్ పేరుతో విద్యాసంస్థలను స్థాపించి ఎంతో మంది పేదలకు విద్యాదానం చేశారని గుర్తుచేశారు. పీ.వి.రావు, గడ్డం వెంకటస్వామి ఆశయాల సాధన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ వర్కింగ్ చైర్మన్ తాళ్లపల్లి రవి, చైర్మన్ గడ్డం సత్యనారాయణ, వైస్ చైర్మన్ జి.పున్నమ్మ, నేతలు స్వరూపారాణి, వెంకటస్వామి, అన్సన్, మంచాల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా బెల్టు షాపులు!

- కాచిగూడ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో యథేచ్ఛగా మద్యం విక్రయం
- సూర్యోదయానికి ముందే మద్యం మత్తులో పేదలు
- 24 గంటలూ అందుబాటులో మద్యం
- పేదల కాపురాల్లో చిచ్చుపెడుతున్న బెల్టు షాపులు



కాచిగూడ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్

అంబర్‌పేట్: కాచిగూడ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బెల్టు షాపుల దందా జోరుగా సాగుతోంది. బస్తీల్లో బెల్టు షాపులు నిర్వహిస్తుండటంతో పేదలు ఆర్థికంగా, శారీరకంగా చితికి పోతున్నారు. నియంత్రించాల్సిన ఎక్సైజ్ పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. కాచిగూడ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోల్నాక, కమాలానగర్, లంక బస్తీలు, గంగానగర్, శంకర్‌నగర్, కృష్ణానగర్, సంజయ్‌గాంధీ నగర్, నరేంద్ర నగర్, న్యూ పటేల్‌నగర్, శివానంద్‌నగర్ తదితర బస్తీల్లో బెల్టు షాపుల దందా జోరుగా సాగుతుంది. బెల్టు షాపుల నిర్వహణ యథేచ్ఛగా కొనసాగుతున్నా ఎక్సైజ్ పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

24/7 అందుబాటులో మద్యం...

బెల్టు షాపులతో 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటోంది. దీంతో మద్యానికి బానిసైన కూలీలు ఎప్పుడు మద్యం కావాలన్నా బెల్టు షాపులను ఆశ్రయిస్తున్నారు. ఉదయం 6 గంటలకే బెల్టు షాపులకు వెళ్లి మద్యం సేవిస్తున్నారు. ఇలా సూర్యోదయం కాకముందే కూలీలు మద్యం మత్తులో జోగుతున్నారు. దీంతో వచ్చే పని కూడా చేయడంలేదు. దీంతో బస్తీల్లో పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా దాదాపు అన్ని ప్రాంతాల్లోని బెల్టు షాపులు పేదల కుటుంబాల్లో చిచ్చు పెడుతున్నాయి. ఉదయం వైన్స్ తెరవక ముందు, ముసివేశాక సైతం మద్యం లభిస్తుండటంతో మద్యం దుకాణాలకు సమయ పాలన విధించడం ఎందుకని పలువురు వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు. బెల్టు షాపులకు తోడు అంబర్‌పేటలో ఉన్న కల్లు కాంపౌండ్‌లు సహితం ఉదయం 7:30లకే తెరుచుకుంటుండటంతో కాంపౌండ్‌లలో సైతం పేద కార్మికులు నిత్యం మత్తుకు అలవాటు పడి అన్నివిధాలా నష్టపోతున్నారు.

వైన్స్ నిర్వహణకే పరిమితమవుతున్న ఎక్సైజ్ పోలీసులు...

మద్యం నియంత్రించాల్సిన ఎక్సైజ్ పోలీసులు కేవలం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మద్యం దుకాణాల నిర్వహణకే సరిపోతున్నట్లు వ్యవహరిస్తున్నారు. మద్యం దుకాణాల్లో అమ్మకాలను ఎలా పెంచాలనే విషయంపై చూపుతున్న శ్రద్ధ బెల్టు షాపులను అరికట్టే విషయంలో చూపించడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బెల్టు షాపుల వివరాలు, సమాచారం వారి వద్ద ఉన్నా వాటి వైపు కన్నెత్తి చూడటం లేదని పలువురు విమర్శిస్తున్నారు. నామ్‌కే వాస్తేగా ఎక్సైజ్ పోలీసులు విధులు నిర్వహిస్తుండటంతో బెల్టు షాపులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఇకనైనా బెల్టు షాపులను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

సుద్దాల హనుమంతు రైతాంగ సాయుధ పోరాట కవి



మాట్లాడుతున్న ఆయాచితం శ్రీధర్

చిక్కడపల్లి: సుద్దాల హనుమంతు కేవలం గీత రచయిత మాత్రమే కాదని తెలంగాణ రైతాంగ ఉద్యమంలో ఆయుధం పట్టిన కవి అని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ ఆయాచితం శ్రీధర్ తెలిపారు. శుక్రవారం త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ ఆధ్వర్యంలో దశాబ్ది పూర్వ మహనీయుల కార్యక్రమంలో భాగంగా సుద్దాల హనుమంతు యాదిలో పేరిట జరిగిన సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయాచితం శ్రీధర్ మాట్లాడుతూ... చిన్ననాటి నుంచి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించారని గుర్తుచేశారు. గానసభ అధ్యక్షుడ వీఎస్ కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు లంకా లక్ష్మీనారాయణ, సి.హెచ్.త్రినాథరావు, శంకర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ రేసులో ఓయూ విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో పలువురు ఓయూ విద్యార్థులు నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. శుక్రవారం ఓయూలో చనగాని దయాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన విద్యార్థి నేతలు ఆశించిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభించలేదన్నారు. రాష్ట్ర అవతరణ అనంతరం ఉద్యోగాల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు పోరాడిన తనతో పాటు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందిన పలువురు నేతలు నామినేటెడ్ పదవుల రేసులో ఉన్నట్లు దయాకర్ వివరించారు.

బయోమెట్రిక్ హాజరు వేళలు మార్చాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సంఘం నాయకులు

ముషీరాబాద్: జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు ఉదయం వేళల్లో ఉద్యోగానికి హాజరయ్యేటప్పుడు బయోమెట్రిక్ అటెండెన్స్ వేళల్లో మార్పులు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్‌కు తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కమిషనర్‌ను కలిసి కార్మిక సంఘం అధ్యక్షుడు డాక్టర్ తిప్పర్తియాదయ్య, కార్యనిర్వహక అధ్యక్షుడు పి.జగన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి సి.హెచ్.కృష్ణ వినతి పత్రం సమర్పించారు. తీవ్రమైన చలి ఉన్నందున పారిశుద్ధ్య కార్మికులు చాలా ఇబ్బందులకు, అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న సమయం ఉదయం 5 నుంచి 6 గంటల వరకు ఉందని... ఈ సమయాన్ని ఉదయం 6 నుంచి 7 గంటల వరకు బయోమెట్రిక్ మిషన్‌లో మార్పు చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం కూడా చలికాలంలో 6 నుంచి 7 గంటల వరకు హాజరు తీసుకున్నట్లు గుర్తు చేశారు. ఈ సంవత్సరం కూడా అదే విధానాన్ని కొనసాగించాలని కోరారు.

కాంగ్రెస్ ధర్నాకు ముషీరాబాద్ నేతలు



ధర్నాలో పాల్గొన్న బిజ్జి శత్రువు

ముషీరాబాద్: పార్లమెంటులో భద్రత వైఫల్యం, ఎంపీల సస్పెన్షన్‌కు నిరసనగా ఇందిరాపార్కు వద్ద కాంగ్రెస్ పార్టీ చేపట్టిన మహాధర్నాకు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి భారీగా తరలివెళ్లారు. ఏఐసీసీ ఫిషర్‌మెన్ సెక్రటరీ బిజ్జి శత్రువు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లినట్లు బిజ్జి శత్రువు తెలిపారు.

మహనీయుల మార్గం అనుసరణీయం

మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్

ఖైరతాబాద్: దళిత హక్కు, ఐక్యత కోసం డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ మార్గంలో తుది శ్వాస వరకు పోరాడిన మహనీయులు దివంగత గడ్డం వెంకటస్వామి (కాక), పీవీ రావులని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య కొనియాడారు. శుక్రవారం మింట్ కాంపౌండ్‌లోని అంబేడ్కర్ స్ఫూర్తి భవన్‌లో పి.వి.రావు 18వ వర్ధంతి, వెంకటస్వామి తొమ్మిదవ వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం చెన్నయ్య మాట్లాడుతూ... పి.వి.రావు తన కుటుంబ శ్రేయస్సు కన్నా కులమే ముఖ్యమని వర్గీకరణకు వ్యతిరేకంగా తన ఉద్యోగాన్ని వదులుకొని దళితులను ఏకం చేసిన ధీరుడన్నారు. వెంకటస్వామి(కాక)తన జీవితం మొత్తం బడుగు, బలహీనవర్గాల వారి అభ్యున్నతికి పాటుపడటమే గాక నిలువ నీడలేని లక్షలాది మంది పేదలకు నీడనిచ్చి గుడిసెల వెంకటస్వామిగా కాక పేరు గాంచారన్నారు. బాబాసాహెబ్ వారసుడిగా, దేశ కార్మిక శాఖ మంత్రిగా ఉండి కార్మికుల ప్రయోజనాల కోసం అనేక సంస్కరణలు తీసుకువచ్చారని, చివరి శ్వాస వరకు తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత తుది శ్వాస విడిచారని గుర్తుచేశారు. వీరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బురుగుల వెంకటేశ్వర్లు, మన్నె శ్రీధర్ రావు, పుణ్య భానుప్రకాష్, కాడారం వినయ్ కుమార్, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల వెంకటేషు, తాలూకా రాజేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగి అనందరావు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గోకుల కళ్యాణ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో అంతర్జాతీయ సదస్సుపై విమర్శలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జంతుశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు పలు విమర్శలకు దారి తీసింది. క్యాంపస్‌లోని సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో రిసెంట్ అడ్వాన్సెస్ ఇన్ జువాలజీ-ఇన్నోవేషన్స్ ఛాలెంజస్ అండ్ అపార్చునిటీస్ అనే అంశం ఈనెల 20న ప్రారంభమై శుక్రవారం ముగిసింది. అంతర్జాతీయ సదస్సు అంటే విదేశాలకు చెందిన ప్రతినిధులు హాజరు కావాలని, ఒక్కరు కూడా విదేశీయులు హాజరు కాలేదని పలువురు విద్యార్థులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని సదస్సుకు హాజరైన విద్యార్థులు అధికారులను కోరారు.

మూడు దేశాల నుంచి పరిశోధనా పత్రాలు..

ఓయూ జంతుశాస్త్రం విభాగం 99 ఏళ్లు పూర్తి చేసుకొని 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు 350 మంది ప్రతినిధులు హాజరు కాగా యూఎస్ఏ నుంచి 3 పరిశోధన పత్రాలు, ఆస్ట్రేలియా, జర్మనీ నుంచి ఒక్కొకటి వచ్చినట్లు హెడ్ ప్రొ.మాధవి వివరించారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

నల్లకుంట: ఫుట్‌పాత్ గుర్తుతెలియని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ సమాచారం మేరకు... శుక్రవారం ఉదయం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి బస్ స్టాప్ వద్ద ఓ గుర్తు తెలియని యాచక వృద్ధుడు(70) అపస్మాకర స్థితిలో పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న నల్లకుంట పోలీసులు శవ పంచనామ నిర్వహించిన మృత దేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

వెంకటస్వామి సేవలు స్ఫూర్తిదాయకం

- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి
- కాకాకు ఘనంగా నివాళులర్పించిన సీఎం సహా ఇతర ప్రముఖులు



జి.వెంకటస్వామి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు, కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి(కాకా) 9వ వర్ధంతి, పూర్వ విద్యార్థుల సమ్మేళనం కళాశాల ఆవరణలో ఘనంగా జరిగింది. జి.వెంకటస్వామి విగ్రహానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... ఎంత సంపాదించామనేది కాకుండా సమాజానికి ఎంత పంచామనేదే ముఖ్యమని అన్నారు. అందులో భాగంగా వెంకటస్వామి సమాజహితం కోసం పేద విద్యార్థులకు విద్యను అందిస్తున్నారని తెలిపారు. అనేక సంస్థలు లాభాల కోసం పాటుపడుతుంటే అంబేడ్కర్ విద్యా సంస్థలు మాత్రం పేద విద్యార్థులకు సేవ చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కష్టపడి చదువుతూ నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగితేనే అనుకున్నది సాధించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి శంకర్‌రావు, అంబేడ్కర్ విద్యా సంస్థల చైర్మన్ జి.వివేక్‌వెంకటస్వామి, కరస్పాండెంట్ సరోజావివేక్, కార్యదర్శి జి.వినోద్‌కుమార్, మాజీ మంత్రి శంకర్‌రావు, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తమ్, ఎమ్మెల్యేలు రాజ్‌ఠాకూర్, కె.ఆర్.నాగరాజు, అరుణోదయ సంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ లింబాద్రి తదితరులు పాల్గొన్నారు. అనంతరం లా కళాశాల విద్యార్థుల గ్రాడ్యుయేషన్ సెరమనీని పురస్కరించుకొని వారికి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. విద్యార్థులు తమ ఆటపాటలతో నృత్యాలతో అదరహో అనిపించారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు



పట్టాలు అందుకున్న విద్యార్థులు

శాస్త్రీయ యోగా పరిశోధన పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

కాచిగూడ: ఓయూ ప్రొఫెసర్ రాజేష్ కుమార్ రచనలో వెలువడిన ‘శాస్త్రీయ యోగా పరిశోధన దృక్పథం కోణాల నుంచి మన సంపూర్ణ ఆరోగ్యం పెంపొందిస్తుంది’ పుస్తకాన్ని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ లక్ష్మీకాంత్ రాథోడ్, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్, ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.లక్ష్మయ్య, పుస్తక రచయిత ప్రొఫెసర్ రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంలో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలి



సీఎంను కలిసిన వేముల రామకృష్ణ

కాచిగూడ: బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో బీసీ నేతలు, విద్యార్థులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వంలో, కాంగ్రెస్ పార్టీలో బీసీలకు తగిన ప్రాముఖ్యత కల్పించాలని ఆయన కోరారు. బీసీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సీఎంకు విజ్ఞప్తి చేశారు.

సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు



కాచిగూడ: సీఎం రేవంత్ రెడ్డిని శుక్రవారం మున్నూరుకాపు సంఘం నేత, గిన్నీస్ బుక్ రికార్డ్ హోల్డర్, మెజీషియన్ సామల వేణు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మున్నూరు కాపులకు ప్రభుత్వంలో, పార్టీలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన సీఎంను కోరారు.

డీడీవీటీఆర్‌సీలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

కాచిగూడ: ఆంధ్ర మహిళా సభ, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఒకేషనల్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యానగర్‌లోని డీడీవీటీఆర్‌సీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మానసిక, శారీరక వికలాంగులు ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని వివరిస్తూ ప్రదర్శించిన నాటకం అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర మహిళా సభ డీడీవీటీఆర్‌సీ చైర్‌పర్సన్ ఎన్.ఉషారెడ్డి, సెక్రటరీ ఎస్.సునంద, ప్రిన్సిపాల్ ఎ.పద్మ తదితరులు పాల్గొన్నారు.

కరసేవకులను సన్మానం



కరసేవకులను సత్కరిస్తున్న శివస్వామి

కాచిగూడ: అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన కర సేవకులను శుక్రవారం విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామి ఘనంగా తస్కరించి అభినందించారు. 1990లో అయోధ్యకు వెళ్లిన అరెస్టై 48 రోజులపాటు జైలు జీవితం గడిపిన కర సేవకులు నాయిని బుచ్చిరెడ్డి, బొల్లంపల్లి రంజిత్ రెడ్డి, లిక్కం అనిల్ కుమార్, కొండా శివ ముదిరాజ్‌లను స్వామీజీ సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

ఘనంగా నవీన్‌గౌడ్ పుట్టినరోజు



అన్నదానం చేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్, ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియ భర్త ఎం.నవీన్‌గౌడ్ జన్మదిన వేడుకలు శుక్రవారం నవీన్ యువసేన ఆధ్వర్యంలో డివిజన్‌లోని పలు ప్రాంతాలలో ఘనంగా జరిగాయి. ముషీరాబాద్ భరత్‌నగర్ చౌరస్తాలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నవీన్‌గౌడ్ హాజరై పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు జన్మదిన కేక్‌ను కట్ చేశారు. బీజేపీ నాయకులు కంచికుమార్, అనిల్‌కుమార్, గిరి, సురేష్, గడ్డం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్య, వైద్యం, ఉద్యోగావకాశాలు కల్పించాలి

కాచిగూడ: మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినంత మాత్రాన మహిళల అభివృద్ధి, రాష్ట్రాలు మారిపోవని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకురాలు మట్ట జయంతి గౌడ్ అన్నారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు ప్రజలందరికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం కాచిగూడలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రాణ త్యాగాలు చేసిన కుటుంబాలని ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఎంతైనా ఉందని అన్నారు.